
# థేంక్యూ, జీవితా!


చేమలమర్రి శ్రీనివాసమూర్తి



"ప్రతి మగవాడి విజయం వెనుక ఒక స్త్రీ తప్పకుండా వుంటుంది." అన్నమాటలు నేను చాలా సార్లు విన్నాను. అవి ఎవరు అన్నారో, ఏ సందర్భంలో అన్నారో నాకు తెలియదు, ఎవరూ చెప్పలేదు కూడాను. వాటి సత్యాసత్యాలు మీద నాకు వుండే అనుమానాలు నాకు వున్నాయి.

కాని ఈ కథ వెనుక మాత్రం ఒక స్త్రీ తప్పకుండా వుంది. ఆమె నా భార్య..... జీవిత.

ఇద్దరం కలిసి పెరిగాము. కలిసి చదివాము. కలిసి ఆడుకున్నాము. కలిసి మెలిసి బ్రతుకుతున్నాం. కానీ నా వెనుక ఆమె వున్నదనే దానికంటే ఆమె వెనుకే నేను వున్నాననటం ప్రస్తుతం సరైనదని అనుకుంటాను. ఎందుకంటే అభిరుచులు యిద్దరివీ కలవటం మూలానా, మే మిరువురం ఫఠనాభిలాషకల వాళ్ళమే. అయితే నేను ఆ విషయంలో వెనుకబడి ఉన్నానని చెప్పక తప్పదు. నేను యింకా సోమర్సెట మామ్, డికెన్స్, మొరేవియో, మొపాసా, కొడవటి గంటి, బుచ్చిబాబు, విశ్వనాథల కాలంలోనే వున్నాను. ఆమె మాత్రం యిర్వింగ్ వాలెస్, జెఫ్రీ ఆర్చర్, షెల్డన్, రాండ్‌ల వరకు దూసుకుపోయింది తెలుగులో వస్తున్న హాట్ కేక్సుసుకూడా ఆమె వదల దు. నాకంటే ఆమెకు ఎక్కువటైము దొరకటం కారణంకావచ్చు.



యిప్పుడు తెలుగు నవలలు వండటం మానేసి నేయటం మొదలైంది. వర్క్‌షాపుల్లో తయారౌతున్నాయి. స్పందన, అనుభూతి లాంటి మాటలకు నిఘంటువుల్లో అర్థాలే దొరకటం లేదు. ప్రస్తుతం సస్పెన్సు, థ్రిల్, యిన్వెస్టిగేషన్ లాంటి మిర్చిమసాలా చొప్పించక పోతే, వాసన చూసే నాథుడు కూడా లేడు. పెంపుడు పావురాళ్లా తిరిగివస్తాయి.

ఒకరోజు ఆరుబయట కుర్చీలో కూర్చొని ఏదో తెలుగు థ్రిల్లర్ చదువుతోంది. "ఏం పుస్తకమది?" అన్నాను ఆఫీసు నుండి అప్పుడే లోపలికి వస్తూ. "తెలుగు నవల" అంటూ ముక్తసరిగా జవాబు చెప్పింది. నాకు వాటి పట్ల (అంటే యిప్పుడు వచ్చే వాటి మీద) సదభిప్రాయం లేదని ఆమెకు తెలుసు.

కాళ్ళు చేతులు కడుక్కొని, బట్టలు మార్చుకుని నా కుర్చీ కూడా తెచ్చు



3-a

కుని ఆమె కెదురుగా కూర్చుని సిగిరెట్ వెలిగించి యాదాలాపంగా అడిగాను "బాగుందా?" అని.

"ఎందుకు బాగుండదూ?" అంటూ ఎదురు ప్రశ్నవేసింది మూతిని బొంగరంలా చేసి. చిన్నపాటి చిలిపి తగాదాకు యిది ప్రారంభంలాంటిది. నాకు మహాయిష్టం. అతి తరచుగా జరిగే ఇలాంటి తగాదాలే మా యిద్దరి రసరమ్య బంధాన్ని ఎప్పటికప్పుడు నిత్యనూతనత్వంతో నింపుతున్నాయనుకుంటాను.

"ఈ దిక్కుమాలిన పుస్తకం చదవటానికి బదులు, ఏదైనా మంచి పుస్తకం తీసుకుంటే కనీసం తృప్తి మిగులుతుంది కదా!" అన్నాను.

"దీనికేమైంది?" అన్నది పుస్తకం లోంచి తల ఎత్తకుండా.

"అంతమంచి నవలా అది?"

"చదివితే గదా, మంచిదో చెడుదో తెలిసేది?" అమె జవాబు.

"ఒక రైటర్ సత్తాను అర్ధంచేసుకోవాలంటే అతని పుస్తకాలు అన్నీ చదవాలా?"

"ఏ పుట్టలో ఏ పాము వుందో ఎలా తెలుస్తుంది?"

పెడసరి ప్రశ్నలెయ్యడంలోనూ, గడుసరి జవాబులు చెప్పటంలోనూ ఆమెకు ఆమేసాటి. ఎంతైనా లాయరుగారి కూతురుగదా!

"సరేలే. you enjoy your trash" నాదేం పోయింది. నాక్కొంచెం కాఫీ యిచ్చి ఈ రోజు పేపరు తెచ్చివ్వు అన్నాను

"యిదంతా trash అనే బదులు నువ్వు కూడా యిటువంటి ట్రాష్ నొక దాన్ని రాయకూడదూ? అంటూ ముసి ముసి నవ్వులు నవ్వుకుంటూ లోపలికి నడిచింది.

ఎక్కడ దెబ్బ కొట్టాలో అక్కడే కొట్టింది. ఆమెకు తెలుసు నేను గ్రాడ్యుయేషన్ చేసే రోజుల్లో రెండు మూడు కథలు వ్రాసాననీ, అవి ప్రచురింపబడ్డాయనీను. కాలేజీ చదువు పూర్తి అయిన వెంటనే ఉద్యోగం దొరకటం. గానుగెద్దు జీవితం ప్రారంభం కావడంతో మళ్ళా ఆ జోలికి పోలేదు. చదవటంలో వుండే తృప్తి, ఆనందం, రాయటం లో లేదనిపించింది. ఫలితంగా యిల్లంతా పుస్తకాలమయమై పోయింది. రెండు మూడు అల్మెరాలు అమర్చినా సరిపోవటంలేదు. ఎప్పుడైనా ఏదో ఆలోచన వచ్చి రాయబోతే సవాలక్ష అనుమానాలు. మనిషిలో జడ్జిమెంటు పెరిగితే పాపులర్ సాహిత్య సృష్టి చేయలేడంటారు శరత్. నాలో జడ్జిమెంట్ పెరిగిందో లేదోకానీ, సాహిత్య సృష్టి మాత్రం నావల్ల కాదనిపించింది. అందుకే జీవితకు చాలా అనాయాసంగా దొరికి పోయాను.

ఒక చేత్తో కాఫీ కప్పు, మరో చేత్తో పేపరు పట్టుకుని వీడని చిరునవ్వుతో, కవ్విస్తున్న కనుదోయితో, వెక్కిరిస్తున్న నాసలుతో, వొచ్చి ఒయ్యారంగా అందించి, ఎదురుగా కూర్చుంది.

"అయితే నేను నవల రాయలేనంటావ్!" అన్నాను సవాలు చేస్తున్నట్లు. తల అడ్డంగా వూపింది నా వల్ల కాదంటూ. నా అహంకారంమీద సమ్మెట దెబ్బ.

"సరే! నేను నీ ఛాలెంజిని మనసారా స్వీకరిస్తున్నాను. నీవు యిన్ని నవలలు చదువుతున్నావు. ఒక మంచి సబ్జెక్టు ఎన్నిక చేసి పెట్టు. రెండు మూడు నెలలు సెలవైనా పెట్టి పూర్తిచేస్తాను" అన్నాను బింకంగా. అప్పుడే సగం నవల పూర్తయినంత కాన్ఫిడెన్స్ ఏర్పడింది నాలో.

"మీరేం రాస్తారండి"

యిప్పుడు తెలుగు నవలలు వండటం మానేసి నేయటం మొదలైంది. వర్క్ షాపుల్లో తయారౌతున్నాయి. స్పందన, అనుభూతి లాంటి మాటలకు నిఘంటువుల్లో అర్థాలే దొరకటంలేదు. ప్రస్తుతం సస్పెన్సు, థ్రిల్, యిన్వెస్టిగేషన్ లాంటి మిర్చి మసాలా చొప్పించక పోతే, వాసన చూసే నాధుడు కూడా లేడు. పెంపుడు పావురాల్లా తిరిగి వస్తాయి.


యిదంతా మీ వల్ల అయ్యేనా! ఎందుకీ లేనిపోని ఆరాటం. అందరికీ అందుబాటులో వున్న కీర్తికాంతను మీ సరసనకూడా నిలబెట్టుకుందామనేనా! అన్నది. ఆ మాటలు సాహితీ ధోరణులను ఎద్దేవా చేస్తున్నాయో, నన్ను వెటకరిస్తున్నాయో అర్ధంకావటం లేదు. ఆకుకు అందకుండా, పోకకు పొందకుండా, గోడమీద పిల్లవాటంగా మాట్లాడటం ఆమెకు వెన్నతో పెట్టిన విద్య.

"ఏది ఏమైనా సరే. నేను ఒక నవల రాసి చూపిస్తాను చూడు. అవసరమనుకుంటే రెండు నెలలు సెలవు పెట్టయినా, నిన్ను పుట్టింటికి పంపించైనా, పాఠకులంతా డంగై పోయే నవలొకటి వ్రాస్తాను. యిది నాకు ఛాలెంజ్" అన్నాను, ఒక నిర్ణయానికి వచ్చి.

కేలెండర్‌లో ఒక చీటీ చినిగింది. నిన్న నేడుగా మారింది. నేను సెలవూ పెట్టలేదు. జీవితను పుట్టింటికి పంపనూలేదు. దాలిగుంటలో కుక్కమాదిరిగా ఆఫీసు పనుల్లో హాయిగా కూరుకుపోయాను. కాని అప్పుడప్పుడూ నేను విసిరిన చాలెంజ్ నన్ను వెక్కిరిస్తోనే వుంది.

ఎండాకాలపు సెలవులకు పుట్టింటికి వెళ్ళటం ఆమెకు ఆనవాయితీ. ఒకటిన్నర సంవత్సరాల బాబును తీసుకుని ఆమె రైలెక్కుతుంటే స్వయంగా వీడ్కోలు చెప్పాను. అప్పుడు అప్రయత్నంగా నానోటినుండి వచ్చిన మాట జీవితను ఒక పదిరోజుల తర్వాత ఎంత తల్లడిల్ల జేసిందో నాకు ముందుగా తెలీదు. ఆ మాట ఎందుకు అన్నానో నాకు తెలియదు. ఏ సిక్త్ సెన్స్ అనిపించిందో, ఏ ఆకాశవాణి ప్రొద్బలం చేసి నా పెదవుల మీదికి సంధించిందో యిప్పటికీ అర్థం కాలేదు.

"నా పిల్లవాణ్ణి ఎలా వున్నాడో అలాగే తెచ్చి అప్పగించాలి" ఆమె మందహాసంతో 'చిన్నా'ను ముద్దుపెట్టుకుంది. నా వైపు



ఆప్యాయంగా చూసింది. రైలు యిద్దరినీ విడదీసి ముందుకుసాగింది.

కాలపురుషుడి కౌగిలిలో మరో యిరవైరోజులు యిమిడి పోయాక, ఒకరోజు మధ్యాహ్నం కాంపు నుండి సరాసరి యింటికి వచ్చేసరికి బిక్కమొగంతో ఎదురొచ్చాడు కృష్ణ వాడి చేతులో టెలిగ్రాం వుంది. ఆ రోజు ఉదయమే వచ్చింది. నెల్లూరునుంచి. ఏం చేయాలో తెలియక నా కోసం ఎదురు చూస్తున్నాడు.


"చిన్న సఫరింగ్. హైఫీవర్. స్టార్ట్ యిమ్మీడియెట్లీ"- జీవిత. తలదిమ్మెక్కుతున్నట్లుగావుంది. చేతులు అప్రయత్నంగా వణికాయి. గుండెల్లోదడ, రక్తం పరుగులు పెట్టినట్లయింది. ఐదు సంవత్సరాలకు అబ్బురంగా పుట్టిన బిడ్డ-. యింకా రెండో సంవత్సరమైనా పూర్తిగా నిండని పసిప్రాయుడు-

"మనం కంగారు పడాల్సిన అవసరం లేదులే మామయ్యా! జ్వరం కొద్దిగా ఎక్కువైవుంటుంది. నాన్నకోసం కలవరించి వుంటాడు. కంగారుపడి మీరు ప్రక్కనుంటే తాను ధైర్యంగా వుండగలుగుతుందని అక్కే టెలిగ్రాం యివ్వమని వుంటుంది" అన్నాడు కృష్ణ. కాని వాడిమాట మీద వాడికే నమ్మకం వున్నట్లులేదు వాడి కళ్ళు చూస్తే.

స్టేషన్‌కు పరుగెత్తి రిజర్వు చేసుకున్నాము మెడ్రాస్ ఎక్స్‌ప్రెస్‌లో. స్టేషన్‌లోని నాకు తెలిసిన మిత్రులిద్దరూ సాయపడ్డారు.

ప్రయాణం చేస్తున్నామన్న మాటేగానీ, మాటి మాటికి టెలిగ్రాంలోని మాటలు, చిన్నా రూపం కలవర పెడుతోంది. "నాజియా హాసన్" పాట వింటూ కులికిన కులుకూ- ఐస్‌క్రీం చేతికి అందివ్వగానే వాడి కళ్లల్లో మెరిసిన మెరుపూ- "పుతాలు(పుస్తకాలు) తిత్తావా!" అంటూ వాళ్ళమ్మను బెదిరించిన బెదిరింపూ- గడ్డం చేసుకోకుండా ముద్దుపెట్టుకొంటే వెంట్రుకల గరుకుదనానికి ఎరుపెక్కిన వాడి లేత బుగ్గలూ- ఎలా మరుపుకు వస్తాయి? కడుపుతీపిని నివారించటం ఎవరికి సాధ్యపడుతుంది? మనం కొన్న ప్రాణంలేని బొమ్మలు వాడికి ఆటబొమ్మలు. వాడు మనకు ప్రాణమున్న ఆటబొమ్మ.

టెలిగ్రాంలో సాధారణంగా అశుభ వార్త యివ్వకూడదని అలా యిచ్చారేమో! కడసారిగా ప్రాణముండగా చూస్తానోలేదో! అయినా జీవితకు తెలుసుగదా, నేను ఎంత కంగారు పడతానో. నిజం నిర్దాక్షిణ్యంగా ఎలా చెప్పగలుగు తుంది?




రైలు ఎక్కే సమయంలో నేను అప్రయత్నంగా అన్నమాటలు నా చెవుల్లో గింగురుమన్నాయి. నవ్వుతూ సాగిపోయిన జీవితను ఈ మాటలు యిప్పుడెంత కలవరపెడుతున్నాయో!

రైలు ఆగినప్పుడల్లా దిగి, డ్రైవర్‌ను తిట్టాలనిపించింది. కోపం.... నిస్సహాయత, ఆలోచనల జోరీగలు. ఒక్కోక్షణం, ఒక్కొక్క యుగంలా గడుపుతూ తెల్లవారుఝామున దాదాపు నాలుగున్నర గంటలకు నెల్లూరు చేరాము.

యింటి ముందు రిక్షా ఆపితే, లైట్లన్నీ వేసి వున్నాయి. నా గుండె నీరయ్యింది. లోపలికి నడిచే ధైర్యంలేక, కృష్ణను లోపలికి పంపి, రిక్షావాడికి డబ్బులిచ్చే మిషతో బయటే వుండి పోయాను. మా మామగారు కృష్ణతో మాట్లాడుతున్నాడు. చిన్నా హాస్పిటల్‌లో వున్నాడనీ తానిప్పుడే అక్కడి నుండే వస్తున్నాడనీ చెప్తున్నాడు. హే. భగవాన్! నీకు కృతజ్ఞతలు ఎలా తెలుపను! లక్షపత్రి పూజ చేయనా! తడిబట్టలతో ఏడుకొండలెక్కి, కల్యాణం చేయించనా!

ఇంట్లోకి అడుగుపెట్టకుండానే అదే రిక్షా ఎక్కేశాను కృష్ణతో సహా నెల్లూరు ఆర్.టి.సి బస్టాండును ఆనుకునేవుంది హాస్పెటల్. మమ్ములనిద్దరినీ చూడగానే బాపురుమంటూ చుట్టేసింది జీవిత. బెడ్ మీద అచేతనంగా పడి వున్నాడు చిన్న. ఎంతలో ఎంత మార్పు! నెలరోజులక్రితం ముద్దులు మూటగట్టే మోముతో, బుల్లి బుల్లి చేతులతో, వరంగల్ రైల్వే స్టేషన్‌లో వీడ్కోలు చెప్పిన నా చిన్నా, యిప్పుడు శవసానంగా పడివున్నాడు, బలహీనంగా.

"చిన్నా! యిటు చూడు నాన్నా! నాన్నొచ్చాడు. చిన్నా!" తలక్రింద చేయి వేసి, మూసివున్న ఆ పసివాని కళ్ళు తెరిపించే ప్రయత్నంచేసింది జీవిత. ఒక్కసారి మెల్లగా కళ్ళుతెరిచి, బలహీనమైన చిరునవ్వొకటి విసిరి కళ్ళుమూసుకున్నాడు.

విషయమంతా పూసగుచ్చినట్లు చెప్పింది జీవిత. రక్తపరీక్ష, మూత్రపరీక్ష, చివరకు యల్.పి. కూడా చేయించినా జ్వరానికి కారణం అంతుబట్టలేదట. డాక్టర్‌గారు దగ్గరుండి ట్రీట్‌మెంటు యిస్తున్నారు. మరో యిద్దరు చిల్డ్రెన్ స్పెషలిస్ట్‌లకు చూపించినా ఫలితం శూన్యమయింది. ఆఖరుకు మద్రాసులో 'బాలగోపాల్ రాజు' గారికి రిఫర్ చేసింది డాక్టరుగారు అంతవరకూ తీసుకున్న శ్రద్ధను గురించి వింటూ, ఆమెకు మనసులోనే వెయ్యి నమస్కారాలర్పించాను.

మరోగంటలో మేము రైల్లో మెడ్రాసు బయలుదేరాం. డాక్టరు రాజుగారి ముందు పిల్లవాడిని పడుకోబెట్టి జడ్జిమెంటు కోసం ఎదురు చూసే ముద్దాయిల్లాగా నిల్చుండిపోయాము.

"మీరు వర్రీ కావలసిన అవసరంలేదు. పది, పదిహేను రోజుల్లో తగ్గిపోతుంది" అంటూ లజ్‌కార్నర్‌లో ఒక హాస్పెటల్‌కి రిఫర్ చేశాడు. బాబును అక్కడ జాయిన్ చేయమన్నాడు. జరపవలసిన పరీక్షలన్నీ వ్రాశాడు. ఆ రోజు సాయంత్రం, అందిన పరీక్షల ఫలితాలన్నీ చూసి "యిది యూరినరీ ట్రాక్ యిన్‌ఫెక్షన్" అని తేల్చి చెప్పాడు.

ఆ హాస్పెటల్ ఒక టు స్టార్ హోటల్‌లాంటిది. అన్ని ఫెసిలిటీస్ వున్నాయి. జూనియర్ డాక్టర్లున్నారు. నర్సులున్నారు. క్లినికల్ లాబ్‌వుంది. కేంటిన్

వుంది. మందులషాపు కూడా అదే కాంపౌండులో వుంది. అందులో ఒక రూం తీసుకుని, మన యిష్టం వచ్చిన డాక్టరు దగ్గర మనం ట్రీట్ మెంట్ తీసుకోవచ్చు. రోజుకొకమారు- అవసరమైతే రెండుసార్లు, విజిటింగ్‌కు వచ్చి. పరీక్షించి, తీసుకోవలసిన జాగ్రత్తలూ, యివ్వవలసిన మందులు, కేస్ షీట్ లో వ్రాసిపోతుంటారు. స్టాఫ్ వాటి ప్రకారం పేషెంట్సుకు ఎటెండ్ అవుతారు.

చిన్నా క్రమక్రమంగా కోలుకుంటున్నాడు. అయితే మేము ఆ హాస్పెటల్లో ఉండగా జరిగిన సంఘటన ఒకటి మమ్ములను బాగా కలవరపరిచింది.

మాకు ఎదురుగావున్న రూములో, ఆరునెలల లోపుగా వున్న పసికందును అడ్మిట్ చేశారు. వాడుకూడా మూడు, నాలుగు సంవత్సరాల తర్వాత పుట్టిన మొదటి సంతానమే. తల్లిదగ్గర పాలు లేకపోవటంతో డబ్బా పాలు పట్టారు. కానీ ఏ పాలూ ఆ అబ్బాయికి సరిపడటం లేదు. విజిటింగ్ డాక్టరు గారు రోజూ ఉదయం సాయంత్రం వచ్చి పరీక్ష చేసి మందులు మారుస్తూ వుండే వారు. మేము యింక మూడురోజుల్లో వెళ్ళిపోతామనగా, ఒకరోజు మధ్యాహ్నం ఆ అబ్బాయికి ఆక్సిజన్ పెట్టారు. పరిస్థితి చేయిజారిపోయేలా వుంది. జూనియర్ డాక్టర్లు విజిటింగ్ డాక్టరు గారికోసం ఫోన్‌చేశారు. ఆయన ఒక ప్రభుత్వోద్యోగి. తన డ్యూటీ యింకా పూర్తికాలేదనీ, తర్వాత నేరుగా అక్కడికే వస్తాననీ అక్కడినుండి జవాబు వచ్చింది. అవసరమైన ప్రికాషన్స్ సూచించినట్లున్నాడు కాబోలు, జూనియర్ డాక్టర్లు ఏవేవో యింజక్షన్లు హడావుడిగా యివ్వటం మొదలు పెట్టారు. అయినా ఫలితం కన్పడటంలేదు. ఆ పసికందు చావు బ్రతుకులమధ్య కొట్టుమిట్టాడుతున్నది. మరణశయ్యమీద తన చిన్నారి బాబు పడే నరక యాతన చూస్తూ నిల్చున్నాడు అప్పుడే ఫోను అందుకుని వచ్చిన ఆ అబ్బాయి తండ్రి.

"డాక్టరుగారు ఏమన్నారు?" అడిగాడు భార్యని.

"డ్యూటీ టైము అయిపోయిన తర్వాత వస్తానన్నారు."

"అంతా అయిపోయిన తర్వాతనా!" అతని కళ్ళల్లో వేదన, కసి. చివర సమయంలో డాక్టరు సమయానికి లేనందుకా! తన బిడ్డను విధాత తన నుండి క్రూరంగా విడదీస్తున్నందుకా?

ఏమనుకున్నాడో, ఏమో, ఒక నిశ్చయనికి వచ్చిన వాడిలాగా, ఒక్క ఉదుటున లోపలికి పోయి. "ప్లీజ్ డాక్టర్. ఆక్సిజన్ తీసివేయండి. స్టాప్ దోజ్ యింజెక్షన్స్. దయచేసి మీరు యిక్కడినుండి వెళ్ళిపోండి. పోయే ముందైనా వాణ్ణి ప్రశాంతంగా కళ్ళు మూయనివ్వండి. ప్లీజ్! అన్నాడు ఉద్వేగంగా. జూనియర్ డాక్టర్లు అతని వైపు అయోమయంగా చూస్తుంటే ప్లీజ్ డు వాంట్ ఐ సే డాక్టర్. లెట్ హిమ్ డై యిన్ పీస్" అన్నాడు వడగళ్ళు వర్షిస్తున్నకళ్ళతో. చూస్తున్న మాకే హృదయ విదారకంగా వుంది ఆ సన్నివేశం, యిక అందులో యిన్‌వాల్వ్ అయిన వాళ్ళ సంగతి వేరే చెప్పాలా!

మరో ఐదు నిముషాలకు ఆ పసికందు శ్వాస ఆగిపోయింది. వార్డంతా, మృత్యుదేవత అడుగుల సవ్వడి వినబడేంత నిశ్శబ్దం. తమ సామాను సర్దుకుంటున్నారు ఆ దంపతులు. ఆమె కళ్ళు ధారాపాతంగా వర్షిస్తూనే వున్నాయి. హాస్పెటల్ బిల్లు చెల్లించి వచ్చారాయన. పోతూ పోతూ మేము వున్న రూంలోకి వచ్చారు చిన్నాను చూసి పోవటానికి. చిన్నాను ఒకసారి నఖ శిఖ పర్యంతం చూసి నుదట ముద్దుపెట్టుకున్నాడు. ఆయన కనుకొనుకుల నుండి జాలు వారిన కన్నీటి బిందువొకటి చిన్నా బుగ్గపై రాలింది. ఆమె ప్లాస్టిక్ సంచీలో నుండి రెండు బొమ్మలు తీసి చిన్నా చేతికి అందించింది.

"మనసు కూడ దీసుకోండి. మీరే యిలా వుంటే, మాతృహృదయం. ఆమెనెలా ఓదారుస్తారు!" అన్నాను. సాంత్వన వాక్యాలు పల్లిస్తున్నానే కానీ, నాకు తెలుసు ఆ బాధేమిటో. అందులో సగం అనుభవించాను కూడా.


నిర్వికారంగా అన్నాడు "బాధ పడటం కాదండి. కనీసం చనిపోయే ముందైనా డాక్టరుగారు ప్రక్కనలేరే అవి నా బాధ. ఆయన చేతుల్లోనే చనిపోయివుంటే కొంత తృప్తి మిగిలేది, మనం చేయగలిగింది చేశామని."

భారంగా అడుగులు వేస్తూ వెళ్ళిపోయారు. రెండు రోజుల వరకు ఆ స్మృతి మమ్ములను వదిలిపెట్టలేదు. మాటిమాటికి ఆ సీను మనోపథంలో పునరావృతం అవుతోంది డాక్టరుగారు చిన్నాను ఫైనల్‌గా చెకప్‌చేసి, మందులేవో వ్రాసి, తీసుకోవలసిన జాగ్రత్తలు చెప్పి "నౌ హి ఈజ్ ఆల్ రైట్ యు కెన్ టేక్ హిమ్ ఎవే" అన్నారు. పదిహేను రోజుల తర్వాత రండి. డాక్టరు రాజమ్మగారిని అడిగానని చెప్పండి అంటూ చిన్నా బుగ్గ మీద చిటికె వేసి వెళ్ళిపోయారాయన.

కన్నకొడుకు చావును, వ్యధాభరిత హృదయంలో ఊహించుకుంటూ, బయలుదేరిన నేను, మరొక తల్లిదండ్రుల హృదయాలలో చిచ్చురగిల్చి వెళ్ళిపోయిన ఆ పసివాడి రూపం మనోనేత్రం ముందు మాటిమాటికి కదలాడుతుండగా, పదిరోజుల తర్వాత వరంగల్ చేరాను, భార్యాబిడ్డతో సహా.

మళ్ళా గానుగెద్దు జీవితం మొదలైంది. ఆఫీసు, ఫైళ్ళూ, మెమోలు, ఉరుకులు పరుగులు, తనిఖీలు, కేసులు, చెత్త, చెదారం...

ఏ కొద్దిపాటి విశ్రాంతి దొరికినా కొండంత సంతోషం. ఎదురుగా అల్మైరా వరుసల్లో నిలబడి, తమతో ఒక గంట సేపు గడపమని మౌనంగా అర్థించే, మామ్,



చెఖోవ్, దోస్తవేయుస్కీ, హార్డీ, లారెన్సు, రస్సెల్, నానా, గోపీచంద్, కోరకుక.... కనీసం రోజుకు ఒకగంటసేపైనా వాళ్ళ మధ్య గడిపితే అదొక అనిర్వచనీయమైన ఆనందం. నీవు మా స్థాయికి ఎదగలేకపోతే మేం చేయగలిగిందేమీలేదు. మేం మాత్రం నీ స్థాయికి దిగిరాలేము. ఎవరో ఒక ప్రముఖ వ్యక్తి మీతో కరచాలనం చేసి, రెండు నిముషాలు మాట్లాడితే పొంగి పొయ్యే మీరు, మేము మా జీవితకాలమంతా వెచ్చించి యిచ్చిన అపార అనుభవాలను, అభిప్రాయాలను అందుకొని, ఆకళింపు చేసుకోలేకపోతే మేం ఏం చేయగలం. మీ అజ్ఞానానికి మేము కారణంకాదు అంటున్నట్లుగా వుంటాయి అల్మైరాలోని పుస్తకాలు.

కాలం గాలికి గతం గతి తప్పింది.

ఉన్నట్లుండి ఒకరోజు సాయంత్రం పురుగు మెదడును తొలిచింది. రెండు మూడు నెలల క్రితం జీవితతో నేను చేసిన చాలెంజ్ గుర్తుకు వచ్చింది. ఆమె చదువుతున్న నవల చూసి.

"మాంచి సబ్జెక్టు సెలెక్ట్ చెయ్యి జీవితా. థ్రిల్, సస్పెన్సు, రొమాన్స్ మేళవించి వుండాలి....." నా మాటలు పూర్తికాకుండానే ఆమె నవ్వుతోంది. అదే చిరునవ్వు. వెక్కిరిస్తున్నట్లుగా.

"ఎందుకు నవ్వుతున్నావ్?" డిమాండ్ చేశాను.

"ఇంతకంటేనా!" అన్నది వీడని దరహాసంతో

ఎంతనిజం!

--తల తిప్పి ప్రక్కకు చూడగలగాలే కానీ....

--అంతరంగ తరంగ మౌనఘోషలను వినగలగాలేగానీ.....

--అనంత రూపాల్లో అనవరతమూ దర్శనమిస్తున్న జీవితాన్ని గ్రహించి, మథించి, విశ్లేషించే, హృదయమూ, స్పందన సామర్థ్యమూ, తీరిక వుండాలేగానీ...

--జీవితాన్ని మించిన సస్పెన్సు, థ్రిల్, రోమాన్సు వేరే ఏముంది!

థేంక్యూ జీవితా! థేంక్యూ!

